కాలుష్యం కోరల్లో పంట కాలువలు

- కాలువల్లోకి వదిలేస్తున్న డ్రైనేజీ నీరు, వ్యర్థ పదార్థాలు
- అధికారుల మధ్య సమన్వయ లోపంతో దుస్థితి

ముమ్మిడివరం: ప్రజలకు తాగు, సాగునీరందించే పంట కాలువలు కాలుష్య కోరల్లో చిక్కుకున్నాయి. చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు, పశు కళేబరాలతో అధ్వానంగా మారాయి. అసలే నీటికి కటకటలాడుతున్న రైతన్నలకు పంట కాలువలు మురుగునీటి కాలువలుగా మారిపోతుండటంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో పలు పంటకాలువలు మురుగుతో చెత్తాచెదారం పేరుకుపోయి అస్తవ్యస్తంగా తయారయ్యాయి. కాలువలకు నీటిని విడుదల చేసేలోపు వీటిని ప్రక్షాళన చేపట్టాల్సిన అవసరం ఉంది.

ముమ్మిడివరం, అమలాపురం నియోజకవర్గాల్లోని ప్రధాన పంట కాలువతో పాటు మీడియం, మైనర్ కాలువల పరిస్థితి దారుణంగా తయారైంది. ప్రతిచోట వీధుల్లోని డ్రైనేజీ నీటిని పంటకాలువల్లోకి యథేచ్ఛగా వదిలేస్తున్నారు. అంతేకాకుండా జంతు కళేబరాలు, ప్లాస్టిక్ వ్యర్థాలన్నీ పంట కాలువల్లోకి పాడేస్తుండడంతో వాటి కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజురోజుకీ పంట కాలువల కాలుష్యం అత్యంత గణనీయంగా పెరిగిపోతుంది. ఎక్కడచూసినా పంట కాలువలే ప్లాస్టిక్‌తో నిండిపోయి కనిపిస్తున్నాయి.


చెత్తా చెదారంతో నిండిపోయిన మురమళ్ల-గుత్తెనదీవి పంట కాలువ

వాటి పక్కకు వెళితే చాలు దుర్గంధం వెదజల్లుతున్నాయి. అప్పుడప్పుడు పంచాయతీ సిబ్బంది పరిసర ప్రాంతాలవారికి నోటీసులు జారీ చేసినా అవి చెత్త కాగితాలకే పరిమితమవుతున్నాయి.

ప్రజారోగ్యానికి హాని

మాగాం-అయినాపురం పంట కాలువ ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో సుమారు కిలోమీటరు మేర గ్రామం నడిబోడ్డున ప్రవహిస్తుంది. కాలువ వెంబడి ఉన్న నివాస గృహాల్లోని మురుగు నీటిని పైపులైన్ల ద్వారా పంటకాలువలోకి వదులుతున్నారు. అంతే కాకుండా కుళ్లిన వ్యర్థాలను కాలువలో వేస్తున్నారు. దీంతో కాలవలోని నీరు కలుషితమవ్వడమే కాకుండా ప్రజల ఆరోగ్యానికి హాని కలుగుతుంది. పంటకాలువను ఆనుకుని శ్రీషిర్డీ సాయిబాబా ఆలయం, శ్రీభగవాన్ బాలయోగీశ్వరుల తపో ఆశ్రమం, గీతామందిరం ఉన్నాయి. ఈ ఆలయాలకు వచ్చే భక్తులతో పాటు అనునిత్యం వందలాది మంది అయ్యప్ప భక్తులు ఇదే కాలువలో పుణ్య స్నానాలు ఆచరిస్తుంటారు. పంటకాలువను ఆధునీకరించి ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలన్న ఆలోచన మరుగున పడింది.

కొరవడిన పర్యవేక్షణ

పంట కాలువలు అధ్వానంగా మారుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనేది బహిరంగ రహస్యమే. నీటిపారుదల, పంచాయతీ శాఖల అధికారుల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తుంది. అలాగే కలుషితానికి కారణాలు తెలుసుకుని నివారణ చర్యలు చేపట్టకపోవడం వల్ల సమస్య మరింత జటిలమవుతుంది. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పంట కాలువల ప్రక్షాళన పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అనుమతులు లేకుండా తవ్వకాలు

కాట్రేనికోన: కాట్రేనికోన మండలం కందికుప్ప పంచాయతీ గాజింగితిప్ప సమీపంలోని గరువుపేటలో ఆక్వా జోన్ పరిధిలోనికి రాకున్నా సుమారు 10 ఎకరాలు చేపలు, రొయ్యలు చెరువులను అనుమతులు లేకుండా తవ్వేస్తున్నారు. వ్యవసాయంపై ఆధారపడిన గరువుపేట రైతులు గతంలో చెరువులు తవ్వే ప్రయత్నాన్ని అడ్డుకోవడమే కాకుండా స్పందనలో ఫిర్యాదుచేశారు. దీంతో లీజుదారుడు చెరువుల తవ్వకం కొంతకాలం నిలిపేసి ఇప్పుడు మళ్లీ ప్రారంభించారు. లీజుదారుడుతో సంబంధిత అధికారులు, దళారులు కుమ్మక్కై తవ్వకాలు చేపట్టారని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. దీనిపై మత్స్యశాఖాధికారి రామకృష్ణను వివరణ కోరగా చెరువుల్ని పరిశీలించేందుకు తమ సిబ్బందిని పంపించామన్నారు.


గరువుపేటలో నాన్ ఆక్వా జోన్ పరిధిలోని చెరువులో జరుగుతున్న తవ్వకాలు

హెల్మెట్ ధారణతో ప్రమాదాల నుంచి రక్షణ

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో యువతీయువకులు వాహనాలు నడిపేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోని కారణంగా ప్రమాదాల తీవ్రత ఎక్కువవుతుందని ఎన్ఆర్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లాడి శామ్యూల్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఓల్డేజ్‌హోమ్ ఆవరణలో మాజీ మంత్రి, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు సమకూర్చిన హెల్మెట్‌ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్‌లు ధరించాలన్నారు. కార్యక్రమంలో విశ్రాంత సీఐ గూటం శివగణేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ గిడ్ల చంద్రరావు, మాజీ వైస్ చైర్మన్ పెండెం సూర్యప్రకాష్ పాల్గొన్నారు.


యానాం వృద్ధాశ్రమంలో హెల్మెట్‌ల పంపిణీ కార్యక్రమంలో నాయకులు

క్లుప్తంగా

టిడ్కో ఇళ్లు అమ్మితే చర్యలు తప్పవు

మున్సిపల్ కమిషనర్ నాయుడు

అమలాపురం టౌన్: టిడ్కో ఇళ్లను అమ్మితే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు తెలిపారు. అల్లవరం మండలం బోడసకుర్రులో అమలాపురం మున్సిపాలిటీ 1630 ప్లాట్లతో నిర్మించిన టిడ్కో గృహ సముదాయంలో కొంతమంది లబ్ధిదారులు తమ ప్లాట్లను అమ్ముకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఇప్పటికే ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్న వారిపై నిఘా పెట్టామని చెప్పారు. ఎవరైనా లబ్ధిదారు తన ప్లాట్లను అమ్మజూపితే సంబంధిత లబ్ధిదారుని రిజిస్ట్రేషన్ తక్షణమే రద్దు చేస్తామని హెచ్చరించారు. పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వమిస్తున్న టిడ్కో ఇళ్లలో ఆయా లబ్ధిదారులే నివసించాలని చెప్పారు.

ఇద్దరు చిన్నారులకు పతకాలు


పతకాలు సాధించిన విద్యార్థులతో కోచ్‌లు కుసువీర్, వైష్ణవి

అమలాపురం టౌన్: కాకినాడ జిల్లా స్పోర్ట్స్ అథారిటీలో సెంట్రల్ ఆర్గనైజింగ్ కమిటీ బుధవారం నిర్వహించిన మినీ ఒలింపిక్ చాంపియన్ షిప్-2023 తైక్వాండో పోటీల్లో అమలాపురానికి చెందిన ఇద్దరు చిన్నారులు ప్రతిభ చాటి పతకాలు కైవసం చేసుకున్నారు. కాకినాడ స్పోర్ట్స్ అథారిటీలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు ముఖ్య అతిథిగా హాజరై విజేతలను అభినందించారు. జూనియర్స్ విభాగంలో కె.రాజేశ్వరి బంగారు పతకం, మచ్చా షణ్ముఖ సాయి శ్రీకర్ వెండి పతకాన్ని సాధించారని అమలాపురం హెచ్‌కే తైక్వాండో క్లబ్ కోచ్‌లు బి.కుసువీర్, వైష్ణవి తెలిపారు.

ఉపాధి కూలీల హాజరు పరిశీలన


భీమనపల్లిలో ఉపాధి కూలీల హాజరును పరిశీలిస్తున్న ఎంపీడీవో గౌరీకుమారి

ఉప్పలగుప్తం: మండలంలోని భీమనపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి కూలీల హాజరును ఎంపీడీవో కేఎస్ గౌరీకుమారి గురువారం పరిశీలించారు. ప్రభుత్వం వేసవిలో కల్పిస్తున్న పని దినాలకు క్రమం తప్పకుండా హాజరై వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. త్వరితగతిన పంటకాలువల్లో పూడికలను తొలగించి రైతులకు సాగుకు ఆటంకం లేకుండా చూడాలని ఏపీవో రాజామణిని ఆదేశించారు.

సామంతకుర్రు శ్మశానవాటికలో మృతదేహం

అల్లవరం: అల్లవరం మండలం సామంతకుర్రు శ్మశానవాటికలో గుర్తు తెలియని మృతదేహాన్ని గురువారం మధ్యాహ్నం స్థానికులు గుర్తించారు. స్థానికులిచ్చిన సమాచారం మేరకు అల్లవరం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం అయినవిల్లి మండలం తొత్తరమూడి గ్రామానికి చెందిన అక్షింతల వీర వెంకట సత్యనారాయణ(48)దని గుర్తించారు. సత్యనారాయణకు రెండేళ్లుగా మతిస్థిమితం లేదు. రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయిన ఆయన సామంతకుర్రు శ్మశానవాటికలో విగతజీవిగా కనిపించాడు. మృతుడికి ఇద్దరు పిల్లలున్నారు. ఘటనపై ఎలాంటి కేసు నమోదు కాలేదు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అల్లవరం: దేవగుప్తం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో వార్షిక మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగించే పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏపీఈపీడీసీఎల్ ఏఈ సూర్యనారాయణమూర్తి గురువారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

హాస్పటల్ పేషెంట్ కేర్ అలవెన్స్ పెంపు

యానాం: ఎల్జీ ఆదేశాల మేరకు యానాం, పుదుచ్చేరి, కారైకల్, మాహే ప్రభుత్వ ఆసుపత్రుల్లో హాస్పటల్ పేషెంట్ కేర్ అలవెన్స్, నర్సింగ్ అలెవెన్స్(నాన్ మినిస్టీరియల్)ను పెంపుదల చేస్తూ గురువారం ఆరోగ్యశాఖ కార్యదర్శి కె.కెనడీ ఆదేశాలు జారీ చేశారు. లెవల్ 8 అంతకన్నా తక్కువ ఉన్న వారికి హాస్పటల్ పేషెంట్ అలవెన్స్‌ను రూ.4,100, లెవల్ 9 అంతకన్నా ఎక్కువ ఉంటే రూ.5,300 పెంపుదల చేశారు. నర్సింగ్ అలవెన్స్‌ను అన్ని లెవల్స్ వారికి రూ.7,200 పెంపుదల చేశారు.

శాస్త్రీయ దృక్పథాన్ని ప్రజల్లో పెంపొందించాలి

అమలాపురం టౌన్: జన విజ్ఞాన వేదిక (జేవీవీ) ద్వారా ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని ప్రజల్లో పెంపొందించాలని జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ ఈఆర్ సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. స్థానిక ఎంప్లాయిస్ హోంలో గురువారం జరిగిన జేవీవీ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. జేవీవీలో ప్రజలను చేర్చి శాస్త్రీయ దృక్పథాన్ని, సైన్స్ ప్రచారాన్ని పెంచాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సందర్భంగా జేవీవీ ముద్రించిన గోడ పత్రికలను జిల్లా కార్యవర్గ ప్రతినిధులు విడుదల చేశారు. మండల, పట్టణ కమిటీల సమావేశాలు వచ్చే నెలలో, జిల్లా మహాసభను ఆగస్టులోను నిర్వహించాలని తీర్మానించారు. సమావేశంలో జేవీవీ జిల్లా ప్రతినిధులు బీఎస్ వెంకటేశ్వరరావు, అబ్బిరెడ్డి రామకృష్ణ, ఖాజా మొహిద్దీన్, కేవీ రమణ, డాక్టర్ బి.రాంప్రసాద్, జి.త్రినాథకుమార్ పాల్గొన్నారు.


గోడ పత్రికలు విడుదల చేస్తున్న జేవీవీ జిల్లా కార్యవర్గ ప్రతినిధులు

మాజీ ఎమ్మెల్యే దొమ్మేటి సేవలు ఎనలేనివి

తాళ్లరేవు: మాజీ ఎమ్మెల్యే దొమ్మేటి వెంకటేశ్వర్లు చేసిన సేవలు ఎనలేనివని పలువురు వక్తలు కొనియాడారు. గురువారం స్థానిక లయన్స్‌క్లబ్ హాలులో అఖిలపక్షం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో దొమ్మేటి వెంకటేశ్వర్లు సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు కుడుపూడి శివన్నారాయణ, టేకుమూడి ఈశ్వరరావు, మందాల గంగ సూర్యనారాయణ, టేకుమూడి లక్ష్మణరావు, ఉంగరాల వెంకటేశ్వరరావు, అత్తిలి బాబూరావు, ధూళిపూడి వెంకటరమణ, కాశి లక్ష్మణస్వామి తదితరులు దొమ్మేటి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


దొమ్మేటి సంస్మరణ సభలో నివాళులర్పిస్తున్న అఖిల పక్ష నాయకులు

బెల్టుషాపుపై పోలీసుల ఆకస్మిక దాడి

కాట్రేనికోన: కాట్రేనికోన మండలం పల్లంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న బెల్టుషాపుపై పోలీసులు ఆకస్మిక దాడి చేశారు. ఈ దాడిలో అమ్మకాలు సాగిస్తున్న కాటం సత్యనందాన్ని అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి యానాంకు చెందిన 180 ఎంఎల్ మద్యం బాటిల్స్ 29, బీర్ బాటిల్స్ 33, రూ.24,400లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి ముమ్మిడివరం కోర్టుకు హాజరుపరచగా న్యాయమూర్తి 15 రోజులు రిమాండ్ విధించారని ఎస్‌ఐ టి.శ్రీనివాస్ తెలిపారు.

షెడ్డు దగ్ధం.. రూ.3 లక్షల ఆస్తి నష్టం

ముమ్మిడివరం: ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని సోమిదేవర పాలెంలో బుధవారం ఆర్‌వీఎస్ రామరాజుకు చెందిన చెరువుల వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా షెడ్డు దగ్ధమైంది. ప్రమాదంలో ఒక మోటారు, విద్యుత్ పరికరాలు, మేత బస్తాలు అగ్నికి ఆహుతయ్యాయి. అగ్నిమాపక అధికారి కేఎస్ కొండబాబు ఆధ్వర్యంలో ఫైర్ సిబ్బంది మంటలను అదుపుచేశారు. రూ.3 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించినట్లు అంచనా వేస్తున్నారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

అమలాపురం రూరల్: కడపలోని డాక్టర్ వైఎస్సార్ క్రీడా పాఠశాలలో 2023-24కు గాను ప్రవేశాలకు ఆసక్తి గల విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తునట్లు అంబేద్కర్ కోనసీమ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకులు సురేష్‌కుమార్ తెలిపారు. పాఠశాలలో నాలుగో తరగతికి సంబంధించి 40 ఖాళీలు, ఐదో తరగతికి 11 ఖాళీలు ఉన్నాయన్నారు. మండల స్థాయి ఎంపికలు జిల్లాలో ఈ నెల 15 నుంచి 20లోపు సంబంధిత మండలాల్లో జరుగుతాయని చెప్పారు. జిల్లాస్థాయి ఎంపికలు ఈ నెల 22 నుంచి 26వ తేదీ వరకూ అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో జరుగుతాయన్నారు.

దేవస్థానం భూమి ఆక్రమణపై విచారణ చేయాలి

యానాం: యానాం భూసమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానం భూమి ఆక్రమణపై విచారణ చేయాలని కోరుతూ గురువారం దరియాలతిప్ప, సీతారామపురం, బాలయోగి కాలనీవాసులు ఆర్‌ఏఓ మునిస్వామికి వినతిపత్రం సమర్పించారు. ఆలయ భూమిని ఆక్రమించుకుని తప్పుడు లీజు డాక్యుమెంట్లను సృష్టించి చమురు సంస్థలకు లీజుకిచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆక్రమణలపై పూర్తిస్థాయి విచారణ నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో ఎం.రాజు, చోడె సుబ్బారావు, ఎం.శ్రీనివాస్, ఆర్.కుటుంబరావు, ఎం.మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా సియోచమ్ క్రికెట్ టోర్నీ

యానాం: క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ పుదుచ్చేరి గుర్తింపు కలిగిన యానాం డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత కొద్దిరోజులుగా స్థానిక మెట్టకూరు ప్రభుత్వ హైస్కూల్ క్రీడామైదానంలో గత నెల 19 నుంచి జరుగుతున్న సియోచమ్ ట్రోఫీ-2023 క్రికెట్ టోర్నీ హోరాహోరీగా సాగుతుంది. గురువారం జరిగిన మొదటి సెమీ ఫైనల్స్‌లో రామాయూత్-ఎ, ఆర్‌వైసీ జట్లు తలపడ్డాయి. మొదటిగా బ్యాటింగ్ చేసిన రామాయూత్ 25 ఓవర్లలో 149 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన ఆర్‌వైసీ జట్టు 89 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో రామాయూత్ విజయం సాధించింది. రెండో సెమీఫైనల్స్‌లో నాగా ఎలెవెన్స్, కేవీఆర్ జట్లు పోటీపడగా నాగాఎలెవెన్స్ జట్టు 129 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన కేవీఆర్ జట్టు 130 పరుగులు చేసి విజయం సాధించింది. దీంతో ఫైనల్స్ రామాయూత్-ఎ, కేవీఆర్ జట్ల మధ్య జరగనుంది. ఫైనల్స్‌కు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ అధ్యక్షుడు పంతగడ సుమన్‌బాబు తెలిపారు.

ప్రజాసేవకు పురస్కారం

- వలంటీర్ల సేవలకు గుర్తింపు
- ఉత్సాహం నింపుతున్న అవార్డులు


కలెక్టర్ హిమాన్షు శుక్లా చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న వలంటీర్

అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో పురస్కారాలు..

మండలం	వలంటీర్లు	సేవావజ్ర	సేవారత్న	సేవామిత్ర
అమలాపురం రూరల్	472	2	6	459
అమలాపురం పట్టణం	264	1	4	254
ఉప్పలగుప్తం	385	2	5	372
అల్లవరం	320	–	5	309
ముమ్మిడివరం(నగరం)	141	–	5	130
ముమ్మిడివరం	242	–	5	232
ఐ.పోలవరం	292	1	5	281
కాట్రేనికోన	380	2	5	367
మొత్తం	2498	8	40	2404

అమలాపురం రూరల్: దేశంలో ఎక్కడా లేని బలోపేతమైన వలంటీర్ వ్యవస్థ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌లో నెలకొల్పారు. దాన్ని సచివాలయ వ్యవస్థకు అనుసంధానం చేయడం ద్వారా ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా, సకాలంలో పేద, మధ్య తరగతి ప్రజలకు చేరువ చేస్తున్నారు. నెలనెలా గౌరవ వేతన మిస్తూ వారిని సేవవైపు ప్రోత్సహిస్తూనే పురస్కారాలతో సత్కరిస్తూ ప్రజల ముందు వలంటీర్లకు అమితమైన గౌరవాన్ని కల్పించారు. తమ బాగోగులు చూసే వలంటీర్లకు ప్రభుత్వం పురస్కారాలను అందిస్తుండంటూ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నగదు పురస్కారాలిలా..

2019 ఆగస్టు 15న ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చింది. అత్యుత్తమ సేవలందించిన వలంటీర్లకు ఏటా సేవా వజ్ర ద్వారా రూ.30 వేలు, సేవారత్న ద్వారా రూ.20 వేలు, సేవా మిత్ర ద్వారా రూ.10 వేలు నగదు పురస్కారం, ప్రశంసాపత్రం, మెడల్, బ్యాడ్జి అందజేసి సత్కరిస్తుంది.

ప్రజల ప్రశంసలే దీవెనలు



అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నాం. ప్రభుత్వ పథకాల్లో ఎవరికి ఎలాంటి ఇబ్బందులున్నా వెంటనే స్పందించి పరిష్కారమయ్యేలా చూస్తున్నాం. దీంతో ప్రజల ప్రశంసలే దీవెనలుగా దక్కుతున్నాయి.

– అడబాల సాయి శ్రీవల్లి, సేవా రత్న పురస్కార గ్రహీత, అమలాపురం

ఎగతాళి చేసినా ముందుకే సాగాను



సచివాలయం పరిధిలో పనిచేస్తున్న నన్ను తొలిరోజుల్లో ఇదొక పెద్ద ఉద్యోగమా అంటూ ఎగతాళి చేసేవారు. పెద్ద పెద్ద జీతాలు తీసుకునేవారిని గౌరవంగా చూసే ఈ సమాజంలో సేవ చేసేవారికి అంతకంటే గొప్ప గౌరవం దక్కుతుందని నా అనుభవంలో తెలుసుకున్నాను.

– రాయుడు మౌనిక, సేవా వజ్ర పురస్కార గ్రహీత, బండారులంక

పద్మనాభరావు కుటుంబానికి సంతాపం

అమలాపురం రూరల్: ఆంధ్రా బ్యాంక్ విశ్రాంతి ఉద్యోగి ఉబ్బన పద్మనాభరావు మృతి చాలా బాధాకరమని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు జక్కంపూడి కిరణ్, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు ఎంఏకే భీమారావులు అన్నారు. పద్మనాభరావు కుటుంబసభ్యులను గురువారం వారిద్దరూ పరామర్శించి సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా పద్మనాభరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరామర్శించినవారిలో వైస్ ఎంపీపీ పాలమూరి బాలకృష్ణ, సర్పంచ్ గెడ్డం స్వరూపరాణి, సరెళ్ల రామకృష్ణ, పినిపే జయరాజు తదితరులున్నారు.


పద్మనాభరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు కిరణ్ తదితరులు

డీఎస్పీను కలిసిన లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

అమలాపురం రూరల్: ఇటీవల బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ అంబికా ప్రసాద్‌ను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వాకపల్లి స్వామినాయుడు ఆధ్వర్యంలో అమలాపురం లారీ అసోసియేషన్ ఓనర్స్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనాలు తెలియజేశారు. డీఎస్పీని కలిసినవారిలో అమలాపురం అధ్యక్షుడు నల్లాశ్రీరాములు, సెక్రటరీ కురసా వెంకట్రావు, ట్రెజరర్ బి.శ్రీరామమూర్తి, జాయింట్ సెక్రటరీ పోలిశెట్టి రాంబాబు తదితరులున్నారు.


డీఎస్పీను పుష్పగుచ్ఛంతో సత్కరిస్తున్న జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

తాచుపాము హల్‌చల్


స్నేక్ కేచర్ పట్టుకున్న తాచుపాము

ముమ్మిడివరం: స్థానిక కొబ్బరి గొడౌన్‌లో తాచుపాము హల్‌చల్ చేసి స్థానికులను భయభ్రాంతులకు గురి చేసింది. ముమ్మిడివరానికి చెందిన సరిపల్లి సత్తిబాబుకు చెందిన కొబ్బరి గొడౌన్‌లో గురువారం అకస్మాత్తుగా తాచుపాము కనిపించడంతో స్థానికులు బెంబేలెత్తిపోయారు. దీంతో స్నేక్ కేచర్ గణేష్ వర్మకు సమాచారం ఇవ్వడంతో ఆయన చాకచక్యంగా తాచుపామును పట్టుకుని ప్లాస్టిక్ డబ్బాలో బంధించారు. పామును అటవీ ప్రాంతంలో విడిచిపెట్టనున్నట్లు గణేష్ వర్మ తెలిపారు.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం కావాలి

కొత్తపేట: డ్రగ్స్ రహిత సమాజమే అందరి లక్ష్యం కావాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) సీఐ మద్దాల శ్రీనివాస్ అన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణపై స్థానిక సిద్ధార్థ, శతాబ్ది కళాశాలల విద్యార్థులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ కట్టా నాగమోహన్ అధ్యక్షతన జరిగిన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ, ఒకసారి మత్తు పదార్థాలకు అలవాటు పడితే మానడం కష్టమని అన్నారు. ఆల్కహాల్, గంజాయి, స్టెరాయిడ్ వంటి మాదకద్రవ్యాలు మనిషి విచక్షణ కోల్పోయేలా చేస్తాయని, తద్వారా అనేక దుష్పరిణామాలు ఏర్పడతాయని చెప్పారు. ఆ వ్యక్తితో పాటు ఆ కుటుంబం అవమానాల పాలవుతుందని, మాదకద్రవ్యాలకు ఆకర్షితులై జీవితాలను పాడు చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఈబీ ఎస్సై కె.అన్నవరం, అధ్యాపకులు పాల్గొన్నారు.

సెంట్రల్ డెల్టాకు నీటి విడుదల

ఆత్రేయపురం: కాలువలకు జలకళ వచ్చేసింది. ముందుగా ప్రకటించిన విధంగానే ఇరిగేషన్ ఏఈ పిల్లా సత్యనారాయణ, ఎల్ఎస్ సీహెచ్ బ్రహ్మాజీరావులు సెంట్రల్ డెల్టా కాలువలకు నీరు విడుదల చేశారు. వేద పండితులు నిర్ణయించిన ముహూర్తం ప్రకారం గురువారం మధ్యాహ్నం 12.30 గంటలకు మోటార్ల స్విచ్ ఆన్ చేసి, కాటన్ బ్యారేజీ గేట్లు ఎత్తి 200 క్యూసెక్కుల నీటిని కాలువలోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా హెడ్ స్లూయిజ్‌ను మామిడి తోరణాలు, అరటి చెట్లతో ముస్తాబు చేశారు. గోదావరికి పూజలు చేసి, నూతన వస్త్రాలు, పసుపు కుంకుమలు, పండ్లు సమర్పించి, హారతి ఇచ్చారు. నీటి విడుదలను క్రమేపీ పెంచుతామని వారు చెప్పారు.

తప్పిన పెనుప్రమాదం

అంబాజీపేట: మాచవరం – అంబాజీపేట ప్రధాన రహదారిలో ఒక చెట్టు కొమ్మ గురువారం రాత్రి ఒక్కసారిగా విరిగిపోయింది. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో పగటి వేళ ఈ కొమ్మ విరిగి పడి ఉంటే పెద్ద ప్రమాదమే జరిగేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. అర్ధరాత్రి ఈ సంఘటన జరగడంతో పెద్ద ప్రమాదం తప్పిందని ఊపిరి పీల్చుకున్నారు.

దివ్యాంగులకు పండ్ల పంపిణీ


చిన్నారులకు పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ సీతారామపురంలోని రిలయన్స్ ధీరూభాయి ఎర్లీ ఇంటర్‌వెన్షన్ సెంటర్‌లోని దివ్యాంగులకు గురువారం పండ్లు పంపిణీ చేశారు. మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు దడాల జగదీశ్వరరావు తల్లి వెంకాయమ్మ నాలుగో వర్ధంతిని పురస్కరించుకుని సుమారు 50 మందికి పండ్లను అందజేశారు.

లిరికల్ వీడియో విడుదల

సఖినేటిపల్లి: 'పల్లె గూటికి పండగ వచ్చింది' సినిమాకు చెందిన రెండు పాటల లిరికల్ వీడియోను సఖినేటిపల్లిలో మ్యూజిక్ డైరెక్టర్ సింధు కె.ప్రసాద్ గురువారం విడుదల చేశారు. వీవీ మెరకకు చెందిన కవి, రచయిత కత్తిమండ ప్రతాప్ ఈ రెండు పాటలు రాశారు. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ సినిమా జూన్ చివరి వారంలో విడుదలవుతుందని ప్రసాద్ చెప్పారు. పల్లెల్లో యువతరం పాత్రపై రెండు పాటలు రాశానని ప్రతాప్ తెలిపారు.

WANTED
Wanted Experienced Nursery, L.K.G., Primary, High School, Coding and Computer teachers (EM)
Salary is Negotiable
Contact : 8328508928
SAIRAM VIDYANIKETAN
Guttenadeevi
I.Polavaram Mandal

